


విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడాలి

ఏపీసీ ప్రేమంత్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ ప్రేమంత్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడాలని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ ప్రేమంత్‌కుమార్ కోరారు. బండి ఆత్మకూరు మండలంలోని ప్రభాత్ కళాశాలలో మోడల్ ప్రీ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ నాలుగురోజుల కార్యక్రమాన్ని సోమవారం ఏపీసీ ప్రేమంత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన తాను విద్యా వ్యవస్థలో పనిచేయాలనే సంకల్పంతో సర్వశిక్ష అభియాన్‌కు ఏపీసీగా వచ్చారన్నారు. పాఠశాలలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, ప్రతి ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులతో మమేకమవుతూ నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ మంచి బోధనా పద్ధతులతో మార్గనిర్దేశకులుగా ఉండాలని కోరారు. పదిమంది ప్రత్యేక మోటివేటర్స్ నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకుని విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్ట పునాదులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో మాధవీలత, బండిఆత్మకూరు ఎంఈవోలు యశోద, మోహన్‌రెడ్డి, ప్రభాత్ విద్యాసంస్థల నిర్వాహకులు సారధిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

కలెక్టర్ రాజకుమారి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీల పరిష్కారంలో ఏ మాత్రం జాప్యం చేయవద్దని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని 326 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లాలో రెవెన్యూ, రీసర్వే అంశాలపై ఎక్కువ శాతం ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఆర్డీవోలు ప్రతిరోజు తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీలను గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే విభిన్న ప్రతిభావంతుల కోసం ముగ్గురు సహాయకులను నియమించినట్లు తెలిపారు.

అంతటా సోలార్ వెలుగులు..!



నంద్యాల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇప్పుడు ఎక్కడ చూసినా సోలార్ వినియోగం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు ఇతరులకు కూడా సబ్సిడీ రూపంలో ఇండ్లపై సోలార్ పలకలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద సోలార్ కిలో వాట్ల ప్రకారం సబ్సిడీ అందించి ప్రజలకు సోలార్ యూనిట్లను మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలోని మూడు డివిజన్‌ల పరిధిలో 645 మంది గృహాలపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. పైగా ఈ నెల ఆఖరికి జిల్లా వ్యాప్తంగా 2000 కనెక్షన్లు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా భవిష్యత్‌లో సోలార్ వినియోగంతో జిల్లాలో సదరు వర్గాలకు విద్యుత్ భారం తగ్గడంతో పాటు ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు ఏపీఎస్పీడీసీఎల్ కొనుగోలు చేసి ఆ నగదును యజమానులకు జమ చేయనుంది. మొత్తంగా కూటమి నిర్ణయంతో సదరు వర్గాలకు ఆర్థికంగా కలిసి వచ్చే అంశంగా ఉండటంతో చాలా మంది యజమానులు ముందుకు వస్తున్నట్లైంది. ఆ దిశగా విద్యుత్‌శాఖ అధికారులు సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా...
- జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు : 5,84,839
- జిల్లాలో ఇప్పటి వరకు సోలార్‌కు దరఖాస్తు చేసుకున్న వారు : 645
- ఈ నెల ఆఖరికి లక్ష్యం : 2000 కనెక్షన్లు..

- ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సదుపాయం
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితం
- బ్యాంకర్ల ద్వారా రుణం కూడా..
- ఇప్పటికే జిల్లాలో 645 దరఖాస్తులు
- ఈ నెల ఆఖరికి 2000 కనెక్షన్ల లక్ష్యం

ఒక్కపైసా లేకుండా....

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పీఎం సూర్యఘర్ కింద వివిధ కిలో వాట్ల ప్రకారం సోలార్ యూనిట్‌లను ప్రజలకు అందిస్తున్నారు. విద్యుత్ రుణ భారం తగ్గించుకోవడంతో పాటు సదరు ఇంటి యజమానులకు ఆర్థికంగా కలిసి వచ్చే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి ఇలాంటి పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా.. తెల్ల రేషన్‌కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీలకు మాత్రం సోలార్ యూనిట్‌కు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వమే ఒక్క పైసా లేకుండా వారి ఇళ్లపై ఏర్పాటు చేస్తుంది. అదే విధంగా బీసీ, ఓసీ తదితర వర్గాలకు మాత్రం సబ్సిడీ రూపంలో సదుపాయం కల్పించింది. 1 కిలో వాట్‌కు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60 వేలు, మూడు కిలో వాట్లకు రూ. 78 వేలు చొప్పున ఇలా.. సబ్సిడీ అవకాశం కల్పించింది. ఇదిలా ఉండగా.. ఒక్క పైసా పెట్టుబడి లేకుండా సదరు యూనిట్‌కు అయ్యే ఖర్చు అంతా కూడా బ్యాంకర్ల ద్వారా రుణ సదుపాయం కల్పించారు. ఎవరైనా ఆర్థికంగా ఉంటే సొంతంగానైనా వెచ్చించుకుని సబ్సిడీ పొంది ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఏపీఎస్పీడీసీఎల్‌కు అందించి ఆర్థికంగా ఆదాయం వెంటనే పొందవచ్చు.

జిల్లాలో ఇప్పటికే 645 మంది దరఖాస్తు...

జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలోని నంద్యాల, ఆత్మకూరు, డోన్ డివిజన్‌ల పరిధిలో 645 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఎక్కడికక్కడ వివిధ ప్రాంతాల ఏఈలు, 23మంది వెండర్స్ సంయుక్తంగా కలిసి ఆ ప్రాంతాల పరిధిలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. దీంతో కొందరు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇదే క్రమంలో 25 బ్యాంకులు కూడా ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అందించే రుణం సదుపాయ అంశాలను వివరిస్తున్నారు. నంద్యాల డివిజన్ పరిధిలో 397, డోన్ డివిజన్ పరిధిలో 165, ఆత్మకూరు డివిజన్ పరిధిలో 83 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆ శాఖ అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఇదిలా ఉండగా.. ఈ నెల ఆఖరికి జిల్లా వ్యాప్తంగా 2000 కనెక్షన్లు పూర్తి చేయాలని ఆ శాఖ లక్ష్యం పెట్టుకుందని తెలిసింది.


జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం

డివిజన్ల వారిగా వచ్చిన దరఖాస్తులు...

నంద్యాల :	397
ఆత్మకూరు:	83
డోన్	:165
మొత్తం :	645

25 ఏళ్ల వరకు విద్యుత్ ఉత్పత్తి..

ఎవరైనా తమ ఇళ్లపై సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే..25 ఏళ్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎవరైనా బ్యాంకు లోను పెట్టుకుంటే.. ప్రతి నెల చెల్లించే విద్యుత్ బిల్లును బ్యాంకు రుణం కింద ప్రతి నెల చెల్లించవచ్చు. నాలుగు లేదా..ఐదేళ్లలో రుణం పూర్తవుతుంది.

మిగతా 4వ పేజీలో

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

5

2.65 లక్షల ఎకరాలకు సాగునీరు: ఎస్ఈ


రాజోలి ఆనకట్ట వద్ద నీటి ప్రవాహన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ, డీఈ

చాగలమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-కడప జిల్లాల్లో కేసీ కెనాల్ కింద 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం ఉందని కర్నూలు ఉమ్మడి జిల్లా ఎస్ఈ బాలచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నీటి ప్రవాహాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ శ్రీశైలంలో 885 అడుగులకు గానూ 883.20 అడుగుల నీరు నిల్వ ఉందని తెలిపారు. 1.13 లక్షల నీరు ఇన్‌ఫ్లో అవుతోందని, 205.66 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు. నంద్యాల జిల్లాలో 1.69 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం ఉందని తెలిపారు. రాజోలి ఆనకట్ట వద్ద 3,978 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందన్నారు. శ్రీశైలం నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారని తెలిపారు. కడప జిల్లాలో 92 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ ఏడాది ముందస్తుగా సాగునీరు విడుదల చేయడంతో రైతులు వరి నాట్లు వేసుకునేందుకు వీలు కలిగిందని అన్నారు. ఎస్ఈ వెంట డీఈ పుల్లయ్య, ఏఈలు జమాల్‌వలి, ఆశాజ్యోతి, సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు న్నారు.

నేటి నుంచి అధ్యాపక పోస్టులకు పరీక్షలు

- జిల్లాలో ఐదు కేంద్రాల్లో నిర్వహణ ● డీఆర్వో రాముునాయక్


అధికారులతో చర్చిస్తున్న డీఆర్వో రామునాయక్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో వివిధ అధ్యాపక పోస్టులకు ఈనెల 15 నుంచి 20 తేదీల్లో నిర్వహించే పరీక్షలకు జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఆర్వో రామునాయక్ తెలిపారు. మంగళవారం నిర్వహించే పరీక్షపై డీఆర్వో సోమవారం తన కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో, అలాగే టీటీడీ జూనియర్, ఓరియంటల్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాణ్యం మండలంలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ కళాశాల, శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల, నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణా డిగ్రీ కళాశాల, శ్రీరామకృష్ణా పీజీ కళాశాల, అయ్యలూరుమెట్ట వద్ద ఉన్న ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పొగాకు రైతుల ఆగ్రహం

- రోడ్డుపై బైఠాయించి నిరసన ● సీఐ, తహసీల్దార్ చొరవతో ప్రారంభమైన కొనుగోలు



పొగాకు కంపెనీ ముందు ధర్నా చేస్తున్న రైతులు

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోలులో ఓ ప్రైవేటు కంపెనీ నిర్లక్ష్యం వహించడంతో ఆ కంపెనీ తీరును నిరసిస్తూ సోమవారం పొగాకు రైతులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. కంపెనీ గేటు ముందర రైతులు చేపట్టిన ఆందోళనతో గడివేముల-నంద్యాల రహదారి ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జేపీఐ కంపెనీ క్వింటాకు రూ.18 వేలు ఇస్తామని ఒప్పందం చేసుకోవడంతో నంద్యాల జిల్లాలోని సంజామల, అవుకు, ఆళ్లగడ్డ, రుద్రవరం, కడప జిల్లాలో పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లో పొగాకు పంటను సాగు చేశామని అన్నారు. పొగాకు బేళ్లను విక్రయించేందుకు కంపెనీ వద్దకు తీసుకొని వచ్చామని, కంపెనీ ప్రతినిధులు కొనకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. నాణ్యత లేదని, క్వింటం పొగాకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు కొంటామంటున్నారని రైతులు వాపోయారు. దీంతో రైతులు రోడ్డుపై బైఠాయించారు. తహసీల్దార్ వెకటరమణ, పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి కంపెనీ ప్రతినిధులతో చర్చించి రైతులు తీసుకొచ్చిన పొగాకును కొనాలని ఆదేశించారు. తక్కువ నాణ్యత ఉన్న పొగాకు బేళ్లను క్వింటం రూ.8 వేలు కొంటామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, రైతులు మహేశ్వర్‌రెడ్డి, సంజీవరాయుడు, గంగయ్య, నరేంద్రకుమార్ ఉన్నారు.









సంధ్యావేళ..

కర్నూలు జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం ప్రకృతి కనువిందు చేసింది. శివారులోని తుంగభద్ర నది సంధ్యావేళ ప్రశాంతంగా ప్రవహిస్తూ నగర ప్రజలను ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటల సమయంలో సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం తుంగభద్ర నదిలో కనిపించింది. నగరంపై మబ్బులు కమ్మిన ఆకాశం ముదురు నీలివర్ణంలో అబ్బురపరిచింది. ఈ అందాలను ప్రజలు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)





అంతటా సోలార్ వెలుగులు..!



5వ పేజీ తరువాయి

పైగా తమ ఇంటికి పోను మిగతా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను విద్యుత్ శాఖకు విక్రయించి తగిన నగదును సదరు ఇంటి యజమాని ప్రతి నెలా పొందవచ్చు. అదే విధంగా ఎవరైనా బ్యాంకులో లోను తీసుకోకుండా సొంతంగా సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే మొదటి నెల నుంచే తమ ఇంటి అవసరానికి పోను మిగిలిన విద్యుత్‌ను విద్యుతశాఖకు విక్ర యించి ఆదాయం పొందవచ్చు. ఇలా 25 ఏళ్ల వరకు ప్రతి నెల ఆదాయం వస్తుంది.

సోలార్ వినియోగం ఎంతో ఉపయోగకరం



ఇండ్లపై సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగకరం. ఆర్థిక ఇబ్బంది లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ, బ్యాంకు రుణ సదుపాయం కల్పించాయి. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితం. పెద్దపెద్ద ఇళ్లతో పాటు ఆపార్ట్‌మెంట్‌లు కూడా సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. ఈ పథకానికి వచ్చిన దరఖాస్తుల్లో నంద్యాల జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఆసక్తి కలిగిన యజమానులు స్థానికంగా ఉండే ఏఈలను సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో www.pm.suryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల ఆఖరికి ఈ లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం.

- సుధాకర్ కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, నంద్యాల

17న మెగా జాబ్ మేళా

కర్నూలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జూలై 17న ఆదోనిలో ఏర్పాటు చేయనున్న జాబ్‌మేళా కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 17న నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదోని సాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. 11 ప్రైవేటు కంపెనీల్లో 450 ఖాళీలను భర్తీ చేస్తారని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 17న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉండి, 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు naipunyam.ap.gov.in యూజర్ రిజిస్ట్రేషన్ లింక్‌లో వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకునేందుకు 9985496587, 9703993995 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కోడిగుడ్డు రూ.7.50



కొలిమిగుండ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధరలు కొండెక్కాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. ఓవైపు మార్కెట్లో చికెన్, మటన్ ధరలు మండి పోతున్నాయి. చికెన్ రూ.200కు పైగా విక్రయిస్తుండగా, మటన్ ధర రూ.850 నుంచి రూ.1000 వరకూ పలుకుతోంది. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కోడి గుడ్లతోనైనా సరిపెట్టుకుందామంటే వాటి ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని అంటున్నారు. రిటైల్ మార్కెట్‌లో ఏకంగా రూ.7.50కు చేరుకోవడంతో వినియోగదారులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవలి కాలంలో మార్కెట్‌లో కోడి గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. డిమాండ్ తగ్గ ఉత్పత్తి లేకే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో రోజుకు లక్షకు పైగా కోడిగుడ్ల వినియోగం జరుగుతున్నట్టు వ్యాపార వర్గాల అంచనా.

శ్రీశైలంలో మాజీ సీఈసీ రాజీవ్ కుమార్



స్వాగతం పలుకుతున్న అధికారులు

నంద్యాల కల్చరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ జ్యోతిర్లింగ పుణ్యక్షేత్రమైన శ్రీశైలాన్ని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ అగర్వాల్ సోమవారం సందర్శించారు. వీరికి ఆలయ అర్చకులు, ఈవో శ్రీనివాసులు, పోలీసు అధికారులు స్వాగతం పలికారు.

ఎందుకీ అప్‌గ్రేడ్..?

- ఉపాధ్యాయులు లేరు.. అదనపు గదులు నిర్మించలేదు
- 400 మంది విద్యార్థులకు ముగ్గురే టీచర్లు

ఆదోని అగ్రికల్చర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల చాలా పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. చూడ్డానికి ఇది బాగుంది. కానీ అప్‌గ్రేడ్ వల్ల పాఠశాలలో ఏ మార్పులు రాలేదు. ఉపాధ్యాయులను నియమించలేదు. పాఠశాలల్లో గదుల కొరత తీరలేదు. ఆదోని పట్టణంలో ఉన్నత పాఠశాలలు ఎటు చూసినా కిలోమీటర్ల దూరం ఉన్నాయి. దగ్గర్లోనే ఉన్నత పాఠశాలలు ఏర్పడ్డాయని తమ పిల్లలను పాఠశాలల్లోకి చేర్పేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. కానీ కొత్తగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. ఇంతకూ ప్రభుత్వం పాఠశాలలను ఎందుకు అప్‌గ్రేడ్ చేసినట్లు? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కిల్చిన్ పేట పురపాలక ఉన్నత పాఠశాల



విద్యారంగ సంస్కరణల్లో భాగంగా పాఠశాలల అప్‌గ్రేడ్‌ను ప్రభుత్వం ఒక విధానంగా తీసుకొచ్చింది. అప్‌గ్రేడ్ అనే మాట చాలా మంచిదే. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ మాటకు భ్రమపడ్డారు. విద్యార్థులు చేరిక పెరిగింది. ఇంత మంది విద్యార్థులను ఎక్కడ కూర్చో బెట్టాలి? ఎలా బోధించాలి? అని ఉపాధ్యాయులు తల పట్టుకుంటున్నారు. ఆదోని పట్టణంలో నాలుగు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు గత ప్రభుత్వ నిర్ల క్ష్యంతో మూతపడ్డాయి. పురపాలక ఉన్నత పాఠశాలలు కేవలం నాలుగే ఉండడంతో పట్టణంలోని విద్యార్థులంతా ఆ పాఠశాల లకే వెళ్లేవారు. ఇది గమనించిన విద్యా శాఖ ప్రాథమికోన్నత పాఠశాలలను నాలు గింటిని ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ పాఠశాలలకు స్కూల్ అసి స్టెంట్లుగా సీనియార్టీ ప్రకారం గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పిస్తూ ఆ పాఠశాలలకు కేటాయించారు. కిల్చిన్‌పేట పురపాలక ఉన్నత పాఠశాల, కల్లుబావి ప్రకాష్ నగర్ పురపాలక ఉన్నత పాఠశాల, ఆస్మియా ఉర్దూ ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ లేబర్ కాలనీ ఉన్నత పాఠశాల తోపాటు అందర్ పేట ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలకు గ్రేడ్-2హెచ్ ఎం లతోపాటు కొంతమంది ఎస్టీటీలకు పదోన్నతి కల్పించడంతో సబ్జెక్ట్ టీచరులు వచ్చారు. ప్రధానంగా కిల్చిన్‌పేట పురపా లక ఉన్నత పాఠశాలలో 6నుంచి9వ తర గతి వరకు 400 మంది విద్యార్థులు చదు వుతున్నారు. కానీ కేవలం హెచ్‌ఎంతో పాటు ఇద్దరే టీచరులు ఉన్నారు. 16 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట హెచ్ఎం, బయాలజీ, ఇంగ్లీష్ బోధించే వారు మాత్రమే ఉన్నారు. ఇంగ్లీష్, సోషల్, హిందీ, ఫిజికల్ సైన్స్ టీచర్లు లేరు. ఇరుకు గదులలలో విద్యార్థులకు కిక్కిరిసి కూర్చుంటున్నారు. ఏడో తరగతిలో 118 విద్యార్థులు ఉన్నారు. తరగతి గది చాలక పోవడంతో బాలికలను ఒక గదిలో బాలు రను మరో గదిలో కూర్చోపెట్టినా చాలక కొందరు కింద కూర్చుంటున్నారు. కల్లు బావి ప్రకాష్ నగర్‌లోని పురపాలక ఉన్నత పాఠశాల 460మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలలో అదే పరిస్థితి. హెచ్‌ఎంతో పాటు నలుగురు ఉపాధ్యా యులే ఉన్నారు. విద్యార్థుల నిష్పత్తికి 16మంది ఉపాధ్యాయులు అవసరం. ఆస్మియా ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో కూడా 182మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ హెచ్‌ఎంతో పాటు నలుగురే ఉపా ధ్యాయులు.



విద్యార్థులతో కిక్కిరిసిన తరగతి గది

డీఎస్సీలోనైనా ఉపాధ్యాయులను నియమిస్తారా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ ప్రకటించింది. అత్యధికంగా జిల్లాల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఇది కూడా పశ్చిమ ప్రాంతమైన ఆదోని నియోజకవర్గంలో ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటా యించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



కిల్చిన్ పేట ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణం

మధ్యలో ఆగిన గదుల నిర్మాణం

గత వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు కింద కొన్ని పాఠశాలలకు అదనపు గ దులు ప్రకటించినా.. నిధులు విడుదల చేయలేదు. కిల్చిన్ పేట పాఠశాలలో మూడు గదులు అర్థాంతరంగా ఆగిపో యాయి. ప్రకాష్ నగర్ పాఠశాల లోనూ ఇదే పరిస్థితి. ఆగిన అదనపు గ దుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయలేదు.

చేరికలు భారీగా పెరిగాయి



మా పాఠశాల చుట్టూ మూడు కిలోమీటర్లలో ఎక్కడ కూడా ప్రభుత్వ ఉన్నత పాఠశాల లేదు. దీంతో మా పాఠశాలలో అడ్మిషన్లు పెరిగాయి. తర గతి గదుల కొరత, ఉపా ధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది.

- ఉరుకుందప్ప, ప్రధానోపాధ్యాయుడు, కిల్చిన్ పేట పురపాలక పాఠశాల, ఆదోని

త్వరలో సమస్య పరిష్కారం



చాలా పాఠశాలల్లో తరగతి గదుల కొరత ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు కేటాయించిన వెంటనే గదులు నిర్మిస్తాం. డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయిన వెంటనే ఆయా పాఠశాలలకు కొత్త ఉపాధ్యా యులు వస్తారు.

- వెంకట రమణారెడ్డి, డిప్యూటీ ఈవో ఆదోని

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఫిర్యాదుల్లో కొన్ని..

ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఫ్యాకల్టీ, అటెండర్, వంట మనిషి, వాచ్‌మన్, స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వెల్దుర్తికి చెందిన ప్రశాంత్‌బాబు మోసం చేశారని కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన నాగమణి, నారాయణ, అక్బర్, రాజేష్, సుజాత, వెంకటేశ్, మద్దిలేటి తదితరులు ఫిర్యాదు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష పైగా 20 మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. కేఎస్ఎస్ ఫౌండేషన్ పేరుతో అపాయింట్‌మెంటు లెటర్స్ ఇచ్చి ఏడాది వరకు పని చేయించుకుని జీతం, డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాదులో ఉన్న తన అక్క అర్చన రాణి లక్ష్మీపురం రోడ్డులోని తమ ప్లాట్‌ను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తోందని కర్నూలు శ్రీరామ కాలనీకి చెందిన అనితారాణి ఫిర్యాదు చేశారు. తన ఇద్దరు కుమారులు వెటర్నరీ డాక్టరుగా, ఏఈలుగా పని చేస్తున్నారని, తనను ఇంటి నుంచి తరిమేశారని కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన హనుమంతు ఫిర్యాదు చేశారు. ఏకోరన్ గాలి మరల కంపెనీలో పని చేస్తున్న సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్ కొన్న భూమిని వదిలి పెట్టి తన భూమిలో తవ్వకాలు మొదలు పెట్టారని, అడిగితే తనను కొట్టడానికి వస్తున్నారని ఆస్పరి మండలం జోహరాపురం గ్రామానికి చెందిన పరమేష్ ఫిర్యాదు చేశారు. కర్నూలు బాలాజీనగర్‌లోని ఇంటి గేటు లోపల ఉన్న తన బైకును దొంగలించారని అన్వర్ ఫిర్యాదు చేశారు.

డ్యూటీ రోస్టర్‌లో అవకతవకలు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన హెచ్‌డీఎస్



ఫిర్యాదు చేస్తున్న రామాంజనేయులు

కర్నూలు హాస్పిటల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది డ్యూటీ రోస్టర్‌లో అవకతవకలు ఉన్నాయని హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడు బి.రామాంజనేయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జీజీహెచ్‌లో ఓ నర్సింగ్ అధికారి యూనిఫాం వేసుకోకుండా విధులు నిర్వహిస్తుందని, ఇటీవల మంత్రి రివ్యూ సమీక్ష సమావేశానికి యూనిఫాం లేకుండా హాజరయ్యారన్నారు. ఏళ్ల తరబడి కొన్ని వార్డుల్లో పాతుకుపోయిన నాన్ స్పెషలిస్టు నర్సులను ఎందుకు మార్చడం లేదని, ఏళ్ల తరబడి సూపర్‌స్పెషాలిటీ కొన్ని విభాగాలు, ఆపరేషన్ థియేటర్‌లో కొందరి నర్సులను ఎందుకు మార్చడం లేదంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. 8 సంవత్సరాల నుంచి ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ పేరుతో కొందరి నర్సులకు నైట్ డ్యూటీలు వేయడం లేదని, కానీ మెడికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్న వారిని, క్యాన్సర్‌తో బాధపడుతున్న నర్సులకు నైట్ డ్యూటీలు ఎలా వేస్తారన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జూనియర్ హెడ్ నర్సులు ఉన్నారని, డీఎంఈ ఆదేశాల మేరకు సీనియర్ హెడ్ నర్సులను వేయాలని కోరారు.

ఐదు తరగతులకు ఒకే టీచర్

- చింతకుంట ప్రాథమిక పాఠశాలలో దుస్థితి
- 329 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు మాత్రమే



చింతకుంట ప్రభుత్వ పాఠశాలలో టీచర్ లేకపోవడంతో ఖాళీగా కూర్చున్న 5వ తరగతి విద్యార్థులు

కోసిగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అక్షరాస్యతలో చిట్టచివరి నుంచి మూడో స్థానంలో కోసిగి మండలం ఉంది. మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 329 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే టీచర్లు బదిలీ కావడంతో గత నెల జూన్ 9వ తేదీన వి. గంగమ్మ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టారు. అయితే.. ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట ఒక్క ప్రధానోపాధ్యాయురాలు మాత్రమే చదువు చెబుతున్నారు. ఆమె విద్యార్థులకు పాఠాలు చెప్పలేక, రికార్డు వర్క్స్ చూసుకోలేక సతమతమవుతున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఏడాది ఒకటో తరగతిలో 55 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. 2వ తరగతిలో 65 మంది, 3వ తరగతిలో 74 మంది 4వ తరగతిలో 69 మంది, 5వ తరగతిలో 66 మంది మొత్తం పాఠశాలలో 329 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వి. గంగమ్మ ఒక్కరే మధ్యాహ్న భోజనం, ఆన్‌లైన్ అటెండెన్స్, అడ్మిషన్లు చూసుకోవాల్సి వస్తుంది. ఇన్ని పనులుగాక ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు ఎలా చెప్పాలని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు తరగతులను నిర్వహించడం కష్టం



మా పాఠశాలలో 329 మంది చదువుకుంటున్నారు. గత నెల 9న కొత్తగా బదిలీపై ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టాను. టీచర్లు ఎవరూ లేరు. ఐదు తరగతులను ఒక్కదాన్నే చూసుకోవడం కష్టంగా ఉంది.

- వి. గంగమ్మ, ప్రధానోపాధ్యాయురాలు, చింతకుంట పాఠశాల



ప్రధానోపాధ్యాయురాలు మాత్రమే ఉండటంతో పాఠశాల బయట ఆడుకుంటున్న విద్యార్థులు



3వ తరగతి క్లాస్ లీడర్లే రివిజన్ చేయిస్తున్న దృశ్యం

మాకు మేమే పాఠాలు చెప్పుకుంటున్నాం



మా పాఠశాలలో ఒక్కరే టీచర్. మేడం ఆఫీసు పని చూసుకుంటున్నారు. మాకు పాఠాలు చెప్పడానికి ఎవరూ లేరు. మా క్లాస్ లీడర్లే రివిజన్ తరగతులు చెబుతున్నారు.

- శ్రీదేవి, 5వ తరగతి విద్యార్థిని, చింతకుంట

పాఠాలు ఎవరూ చెప్పడం లేదు..



మేడం ఒక్కరే భోజనాలు, అటెండెన్స్ చూసుకుంటున్నారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేకపోవడంతో భోజనం తిని ఆడుకుని ఇంటికి వెళ్తున్నాం.

- అభిరాం, 4వ తరగతి విద్యార్థి, చింతకుంట

అపహరణ కేసు నమోదు

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణానికి చెందిన కామిరెడ్డి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అపహరణ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన చెప్పిన దాని ప్రకారం.. పెసరవాయి గ్రామానికి చెందిన కామిరెడ్డి రాధకు కర్నూలు పట్టణం వాసవీనగర్‌కు చెందిన మురళీమోహన్‌రెడ్డితో వివాహమైంది. పెసరవాయిలో మొహర్రం వేడుకలకు రాధ తన తల్లి పుణ్యవతితో కలిసి కర్నూలు నుంచి బస్సులో బయలు దేరింది. ఇంటికి వచ్చి చూసుకుంటే బ్యాగ్‌లోని క్యారియర్ బాక్సులో ఉంచిన 4 తులాల బంగారు కనిపించ లేదు. రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు..

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని గడిగరేవుల గ్రామానికి చెందిన క్రిష్ణవేణికి, నంద్యాల పట్టణానికి చెందిన వెంకటశివభరత్‌కు ఏడాది క్రితం వివాహమైంది. కొన్నాళ్ల పాటు వారి సంసారం సజావుగా సాగింది. భర్త వెంకటశివ భరత్, అత్త సుబ్బలక్ష్మమ్మ, మామ గోపాల్, బావ రమణకుమార్ అదనపు కట్నం తీసుకొని రావాలని మానసికంగా, శారీరకంగా వేధించారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి..

కోవెలకుంట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని బసిరెడ్డిబావి వీధిలో ఉన్న హసీనా అనే మహిళ ఇంటి ఎదురుగా ఉన్న కిశోర్, మల్లేశ్వరి, మల్లిక గొడవ పడ్డారు. ముగ్గురు కలిసి హసీనాపై దాడి చేయగా తలకు రక్తగాయాలయ్యాయి. కూతురు నసీమా కోవెలకుంట్ల పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌కే తండా గ్రామానికి చెందిన నిర్మలాబాయి(23) వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎల్‌కే తండాకు చెందిన శ్రీకాంత్‌నాయక్, నిర్మలాబాయి 4 ఏళ్లక్రితం ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొన్ని రోజుల నుంచి భర్త శ్రీకాంత్‌నాయక్, అత్త బోడేబాయి, ఆడపడుచు శాంతిబాయి, మామ మంగేనాయక్ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో సోమవారం నిర్మలాబాయి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి బుజ్జిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

మిడుతూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని 49 బన్నూరు గ్రామానికి చెందిన షేక్ దర్వేష్ (14) అనే బాలుడు విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గత నెల 2వ తేదీన షేక్ రసూల్ సాబ్ పొలానికి వెళ్లడంతో అతని కుమారుడు షేక్ దర్వేష్ కూడా వెళ్లాడు. అక్కడ తండ్రి కోసం వెతుకుతున్న క్రమంలో పొలంలో వున్న విద్యుత్ మోటారు వైర్లు తగిలి దర్వేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పొలంలో విద్యుదాఘాతానికి గురైన బాలుడ్ని కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దర్వేష్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి..

నంద్యాల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం నూనెపల్లె సమీపంలోని రైల్వేట్రాక్‌పై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వేహెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. చనిపోయిన వ్యక్తికి సుమారుగా 38 ఏళ్లు ఉండవచ్చునని, తెల్లచొక్క ధరించాడని, తెలిసిన వాళ్లు రైల్వేస్టేషన్‌కు రావాలని కోరారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బెంగళూరులో కుంకనూరు వాసి..

దేవనకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కుంకనూరు గ్రామానికి చెందిన కురువ బచ్చాల రవికుమార్ (30) బెంగళూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పెద్ద రంగన్న, సులోచనమ్మ దంపతుల పెద్ద కుమారుడు రవికుమార్ బెంగళూరులో ఎక్స్‌కవేటర్ నడుపుతూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బావమరిది రవితేజతో కలసి బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో వెనుక వైపు నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. రవికుమార్‌కు భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.



రవికుమార్ (ఫైల్)

కుందూ నదిలో పడి మహిళ..

ఉయ్యాలవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలోని కుందూనదిలో పడి దాసరి వెంకటలక్ష్మమ్మ(47) మృతి చెందారు. ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. సంజామల మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ కుమారుడు వెంకటేశ్వర్లుతో కలిసి ఉయ్యాలవాడ గ్రామానికి బైకుపై బయలుదేరారు. ఆదివారం రాత్రి 10.30లకు రూపనగుడి సమీపంలో కుందూ బ్రిడ్జిపై వెళ్తుండగా బైక అదుపుతప్పి నదిలోకి పడింది. దీంతో తల్లి, కుమారుడు నదిలో పడ్డారు. కుమారుడు ఈత రావడంతో తల్లిని గడ్డకు చేర్చే ప్రయత్నం చేశారు. అంతలో అక్కడున్న కొందరు వ్యక్తులు గమనించి తల్లిని గడ్డకు చేర్చారు హుటాహుటిన ఆమెను 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటలక్ష్మమ్మ కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్దపాడు సమీపంలో దారి దోపిడీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ప్రధాన నిందితుడు రమేష్ (వాసవి నగర్, కర్నూలు), మరో ఇద్దరు బాల నేరగాళ్లు ఉన్నారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామానికి చెందిన నూర్ బాషా అనే వ్యక్తి ఈ నెల 5వ తేదీన తెల్లవారుజామున హైదరాబాదు నుంచి కర్నూలు వచ్చారు. తెర్నేకల్లు వెళ్లాలని బళ్లారి చౌరస్తా వద్ద నిల్చుని ఉన్నారు. ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి ఎక్కడికి వెళ్లాలని అడిగారు. మెయిన్ రోడ్డులో ఉండే కడివేముల వద్ద దిగుతానని నూర్‌బాషా చెప్పారు. తాము కూడా బళ్లారి వెళ్తున్నామని, రూ.100కు టికెట్ మాట్లాడుకుని నూర్‌బాషాను కారులో ఎక్కించుకున్నారు. పెద్దపాడు దాటిన తర్వాత ఆయనను కొట్టి సెల్‌ఫోన్, ఏటీఎం, క్రెడిట్‌కార్డు బలవంతంగా లాక్కున్నారు. ఫోన్ పే ద్వారా రూ.12వేల నగదును మరొకరి అకౌంటుకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. రూ.6,500 నగదు లాక్కొని నెరవాడ సమీపంలో కారు నుంచి బయటకు తోసేసి వెళ్లిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం కర్నూలులో ముగ్గురిని అరెస్టు చేసి చేసి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఏటీఎం, క్రెడిట్ కార్డు, దోపిడీ చేసిన రూ.12వేలు, కారు స్వాధీనం చేసుకున్నారు. మద్యానికి బానిసై దోపిడీకి పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కాల్వలు ఇలా... నీరు పారేదెలా...?

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో తాగు, సాగునీరు అందించే ప్రధాన కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. కాల్వల మరమ్మతులకు రెండునెలల సమయం ఉన్నప్పటికీ జలవనరులశాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనుపడుతోంది. కాల్వల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి నీళ్లు ముందుకెళ్లడం లేదు. మహానంది రోడ్‌లోని అబాండతాండ సమీపంలో వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే పాలేరు వాగు పూర్తిగా మూసకపోయింది. నీళ్లు ముందుకు పారకుండా పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికే కేసీ కెనాల్‌కు మూడు అడుగుల మేర నీరు విడుదల చేశారు.

నేటికి కాల్వ పూర్తిస్థాయిలో ప్రవహించే అవకాశముంది. నంద్యాల పట్టణానికి తాగునీటిని అందించే తూము వద్ద మట్టి కుంగిపోయి తూము షట్టర్లలకు ప్రమాదం ఏర్పడే అవకాశమున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.



అబాండతండా వద్ద కేసీ కాలువలో పేరుకుపోయిన గుర్రెపుడెక్క

కేసీకి 1,500 క్యూసెక్కుల నీరు విడుదల

సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 1, 500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ప్రతాప్ తెలిపారు. గోరుకల్లు నుంచి ఎస్సార్బీసీకి సోమవారం నీరు విడుదల చేశామన్నారు. నేడు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తెలుగుగంగకు విడుదల చేస్తామన్నారు.



నంద్యాల పట్టణానికి తాగునీటిని వదిలే తూము దుస్థితి

కాంట్రాక్టు పద్ధతిలో వైద్య పోస్టులు వద్దు

- బోధనాసుపత్రి వైద్యులకు తీవ్ర నష్టం
- కర్నూలు జీజీహెచ్‌లో ప్రభుత్వ వైద్యుల సంఘం నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయరాదంటూ ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపింది. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ సీఎల్‌జీ ఎదుట ఏపీజీడీఏ (కర్నూలు మెడికల్ కాలేజ్ బ్రాంచ్) వైద్యులు కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుల పోస్టుల భర్తీని తక్షణమే నిలుపుదల చేయాలని ఏపీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ పి.బ్రహ్మాజి మాస్టర్, కోశాధికారి శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు రామశివనాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుల పోస్టులను తాత్కాలికంగా నిలుపుదల చేసి ముందుగా వైద్యులందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని బోధనాసు పత్రుల్లో 40 మంది ప్రొఫెసర్లు, 35 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం నోటిఫికేషన్‌ను రద్దు చేసి వైద్యులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ శారద, ప్లాస్టిక్ సర్జరీ వైద్యురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువులు, విత్తనాల షాపుల్లో రాష్ట్రస్థాయి తనిఖీ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రాష్ట్రస్థాయి తనిఖీ బృందం కమలాపురం వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, అనంతపురం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు బృందం ఎరువులు, పురుగుల మందుల షాపులతో పాటు గోదాములను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఎరువుల నిల్వల స్టాక్ రిజిస్టర్లను, అనుమతి పత్రాలను పరిశీలించారు. న్యూవసువాహిని ఆగ్రో ఏజెన్సీస్‌లో రూ.84వేల విలువైన ఎరువులు, శివసంతోష్‌రెడ్డి ఏజెన్సీస్‌లో రూ.70వేల విలువైన ఎరువులకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటి అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. తనిఖీ అధికారులు నరసింహారెడ్డి, నాగభూషణం మాట్లాడుతూ దుకాణాలు, గోదాముల్లోని స్టాక్ వివరాలు ప్రతిరోజు మండల వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. ఎరువులు, పురుగులమందులు, విత్తనాలను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించవద్దని, ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన ఎరువులను జిల్లాలోనే విక్రయించాలన్నారు. విత్తన శుద్ధి కేంద్రాల యజమానులు ఫౌండేషన్ రిజిస్టర్, మొలకశాతం రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని, ప్రాసెసింగ్ చేసే సమయంలో విత్తనాలు కల్తీ జరగకుండా జాగ్రత్తగా ప్రాసెసింగ్ చేయాలని ఆదేశించారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పొదుపు రుణాల్లో గోల్‌మాల్..!

- రూ.36 లక్షలు కాజేసిన మహిళ

ఆత్మకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పొదుపు సంఘాలకు జారీ చేసిన రుణాల్లో గోల్‌మాల్ చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని కిషన్‌సింగ్‌వీధిలో గతంలో పొదుపు సంఘాలకు జారీ చేసిన రుణాల్లో అవకతవకలు జరిగాయని ఓ బ్యాంకు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నాలుగు స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లకు రుణాలను మంజూరు చేయించేందుకు ఓ ఎస్‌హెచ్‌జీ గ్రూపు లీడర్ ముందుకొచ్చింది. ఆ క్రమంలోనే నాలుగు సంఘాలకు చెందిన కొందరి రుణాలను ఓ మహిళ స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పొదుపు సంఘాల ప్రక్షాళన నేపథ్యంలో సభ్యుల చేర్పు, తొలగించేందుకు సంబంధించి పరిశీలన చేయగా కొందరి సభ్యుల పేర్లపై నేటికీ అప్పులు ఉన్నట్లు తెలిసింది. అయితే వారు తాము ఎలాంటి రుణాలను తీసుకోలేదని, ఓ గ్రూపు లీడర్ తమను మోసం చేసి సుమారు రూ.36 లక్షలు స్వాహా చేసినట్లు బాధితులు అధికారుల ఎదుట వాపోయినట్లు తెలిసింది. ఈ విషయంపై మెప్మా సీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని అన్నారు.

తాగునీటి కోసం సర్పంచ్ ఇల్లు ముట్టడి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మద్దికెర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బెస్తవీధి కాలనీవాసులు సోమవారం సర్పంచ్ బండారు సుహాసిని ఇంటిని ముట్టడించారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై సోమవారం సాయంత్రం నిరసన తెలిపారు. మూడు నెలల క్రితం పంచాయతీ వారు ఉచిత కొళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పడంతో కొళాయిలు వేసుకున్నామన్నారు. కార్యదర్శి శివకుమార్ కొళాయిలకు పైపులైన్ ద్వారా నీరందిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

- ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్
- పోలీసులు, విద్యార్థి నాయకుల మధ్య తోపులాట



కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా విద్యార్థి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ ప్రకారం ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి అయినా అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ కార్యకర్తలు, నిరుద్యోగులు వినూత్న రీతిలో అర్ధనగ్న ప్రదర్శనతో ఖాళీ ప్లేట్లతో నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో సంపాదన సృష్టించి 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని, అందుకు ప్రణాళిక కూడా సిద్ధ చేశామని బహిరంగంగా ప్రకటించి నిరుద్యోగ ఓట్లతో గద్దెనెక్కి కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపార్టుమెంట్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల్లోని యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్ గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు కంచెను ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. పోలీసులకు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, పెద్దయ్య, రంజిత్‌గౌడు, జాఫర్‌పటేల్, నాగరాజు, నాయకులు నిరుద్యోగులు పాల్గొన్నారు.

బైకు దొంగల అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శేషయ్య సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితులు షేక్ బాబ ఫక్రుద్దీన్ (అన్నమయ్య జిల్లా), షేక్ దాదాపీరా (అన్నమయ్య జిల్లా), హనీఫ్ (కడప)లను అరెస్టు చేశామన్నారు. వారు తెలిపిన వివరాల మేరకు... గూడూరుకు చెందిన చంద్రకుమార్ మే 22వ తేదీన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. పార్కింగ్‌లో ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 23 మోటారు సైకిళ్లను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కర్నూలు, నంద్యాల, గుంతకల్లు, హైదరాబాదు, నార్పల, అనంతపురం జిల్లాలో పలు బైక్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. సుబాన్, షాపీర్ అనే నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్పీ కార్యాలయానికి 130 ఫిర్యాదులు

నంద్యాల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 130 ఫిర్యాదులు వచ్చినట్లు అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో నిర్ణీత సమయంలో విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువగా కుటుంబ తగాదాలు, అత్తారింటి వేధింపులపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

పాణ్యం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం ఆమె గోరుకల్లు రిజర్వాయర్ నుంచి 600 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేశారు. రిజర్వాయర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం నిర్వహించి అనంతరం నీటిని విడుదల చేశారు. అనంతరం ఎస్ఈ శుభకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్‌లో సమృద్ధిగా సాగునీరందించాలన్న ధ్యేయంతో గోరుకల్లు రిపేరీలు త్వరిత గతిన పూర్తి చేశామన్నారు. కొండజూటూరు రైతులు తమ గ్రామంలోని పంటభూములు ఎస్సార్బీసీ నీటితో బీడుగా మారాయని నీటి తగ్గింపుకు చర్యలు చేపట్టాలని కోరారు. తొగర్చేడు వద్ద మెయిన్ కెనాల్‌కు గండి పడి నీరు వృథాతో పంట భూములు దెబ్బతింటున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కాడా ఈఈ కిష్టన్న మాట్లాడుతూ తొగర్చేడు వద్ద పంట కాల్వ దెబ్బతినడంతో రూ. 68 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. ఎస్ఈ శుభకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రిజర్వాయర్‌లో మూడు టీఎంసీల నీరు ఉందని ఖరీఫ్‌కు సమృద్ధిగా నీరందించడానికి రిజర్వాయర్‌ను 11 టీఎంసీల వరకు నింపడానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్సార్బీసీ డీఈలు సుబ్రహ్మణ్యం, గీతావాణి, జ్యోతి, అమృత్, సాగునీటి సంఘాల నాయకులు రాంపుల్లారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.



గోరుకల్లు రిజర్వాయర్ వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

సాగునీరు విడుదల

పాములపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల ఎత్తిపోతల పథకం ద్వారా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి బటన్ నొక్కి 24 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ముందుగానే సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తామని, రైతుతకు సబ్సిడీలో విత్తనాలు, యంత్రాలు, పనిముట్లు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామన్నారు. నీటిని రైతులు సద్వినియోగం చేసుకొని సకాలంలో పంటలు సాగుచేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎత్తిపొతల పథకం ఛైర్మన్ విష్ణువర్దన్‌రెడ్డి టెక్నికల్ అసిస్టెంట్ సాంబశివుడు నాయకులు మాండ్ర సురేంద్రనాధ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, ఖాత అంకిరెడ్డి, స్వాములు, మల్లేశ్వరరెడ్డి, పూసలక్రిష్ణ, గోవిందు పాల్గొన్నారు.



లింగాల ఎత్తిపోతల నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మాండ్ర

మోడల్ స్కూల్‌ను పరిశీలించిన ఏపీసీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ ప్రేమంత్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు మండలం పార్నపల్లె సమీపంలో ఏపీ మోడల్‌స్కూల్‌ను సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ ప్రేమంత్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నంద్యాల పట్టణ శివారులోని పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే స్థితిలో ఉన్న మోడల్‌స్కూల్‌ను తాత్కాలికంగా ఇటీవల పార్నపల్లె సమీపంలోని ప్రభాత్ కళాశాల భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా ఏపీసీ పాఠశాలకు చేరుకుని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి బస్సులు సరిపోవడం లేదని తెలుసుకుని అక్కడికక్కడే ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. విద్యార్థులకు ఏ మాత్రం అసౌకర్యం లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీనిచ్చారు. కొత్త బిల్డింగ్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

21న మెగా జాబ్ మేళా

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ రాజకుమారితో పాటు జిల్లా అధికారులు విడుదల చేశారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 21న నంద్యాల పట్టణంలోని ఎన్‌టీఆర్ షాదీఖానాలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 11 ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటా వ్యాధుల సర్వే

బండిఆత్మకూరు, జూలై14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటా సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే చేస్తున్నట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఏ కోడూరు గ్రామంలో నంద్యాల మెడికల్ కళాశాల డాక్టర్ విజయకుమారి ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఇంటింటా బీపీ, షుగర్, క్యాన్సర్, క్షయ వ్యాధుల గుర్తింపు పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. డాక్టర్ సవిత, సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పశువులకు టీకాలు వేయించాలి: ఏడీ

బండిఆత్మకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆవులు, ఎద్దులు, దూడలకు లంపి స్కిన్ వ్యాధికి తక్షణమే టీకాలు వేయించాలని వెలుగోడు ఏడీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం మం డలంలోని బండిఆత్మకూరులో డాక్టర్ అనూష, శింగవరం గ్రామంలో డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో లంపి (చర్మ బొబ్బ) వ్యాధికి టీకాల కార్యక్రమం నిర్వహించారు. శింగవరంలో ఏడీ పశువులకు టీకాలు వేశారు. కార్యక్రంలో ఎల్ఎస్ఏ మహబూబ్‌బాషా, సిబ్బంది పాపిరెడ్డి, అర్జున్ పాల్గొన్నారు.

మూల్యాంకనం రెమ్యునరేషన్ చెల్లించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి మూల్యాంకనం రెమ్యునరేషన్‌ను ఉపాధ్యాయులకు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు సోమవారం డీఈవోకు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు సాంబశివుడు, నగిరిశ్రీనివాసులు మాట్లాడుతూ మార్చిలో జరిగిన పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించిన రెమ్యునరేషన్ నేటి వరకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

మహానంది, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు యూరియా గురించి ఎలాంటి ఆందోళన చెందవద్దని మహానంది మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం తిమ్మాపురం సొసైటీలో యూరియా నిల్వలను ఏవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులను అందజేస్తామన్నారు. ఎలాంటి అపోహలకు గురికావదన్నారు.

శ్రీశైలం అన్నప్రసాద వితరణకు విరాళం

నంద్యాల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు రూ 100116 విరాళం అందజేసినట్లు అన్నప్రసాద వితరణ పర్యవేక్షకురాలు దేవిక తెలిపారు. సోమవారం విశాఖపట్నంకు చెందిన సూర్యదేవర సాంబశివరావు విరాళం అందజేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎన్జీవోస్ కాలనీలోని ఖలీల్‌సిద్ధిఖీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2004-05 పదవ తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి ముద్దంనాగనవీన్ ఆధ్వర్యంలో అప్పటి ఉపాధ్యాయులు నాగేశ్వరరెడ్డి, సిద్ధిఖీ, అస్మద్దీన్, మస్తాన్, ఖదీర్, అంజాద్‌బాషాలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులకు పాఠశాలకు బీరువాను బహుమతిగా అందజేశారు.

గోస్పాడు: మండలంలోని గోస్పాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999-2000సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు పాతికేళ్ల తర్వాత ఆత్మీయసమ్మేళనం సోమవారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు నందయ్య, మౌలాలి, సుధాకర్, రామ్మోహన్‌రెడ్డి, రవికుమార్, సుధాకర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఆనాటి ఉపాధ్యాయులతో తమ మధురస్మృతులను గుర్తుచేసుకుంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు జాకీర్ హుసేన్, బాలరాజు, రమేష్, భవాని, రమణేశ్వరి, సురేష్, మనోహర్, పెద్ద ఆచారి, సుధీర్, రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లలిత, గోపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడులో అధికారుల దాడులు

వెలుగోడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వెలుగోడులోని పలు ఎరువుల దుకాణాలలో సోమవారం విజిలెన్స్, వ్యవసాయాధికారులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని సాయి శ్రీనివాస, దుర్గాభవాని ఫర్టిలైజర్స్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. గోదాంలోని నిల్వలను, రికార్డులలోని వివరాలనువివ రాలను వారు తనిఖీ చేశారు. సరైన బిల్లులు లేని రూ. 13 లక్షల విలువ గల విక్రయాలను వారు నిలిపి వేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన అగ్రికల్చర్, విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రసాద్, శ్రీనివాసులు, ఆత్మకూరు ఏడీఏ శశికళ, వెలుగోడు ఏవో స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవోఎంఎస్ నెం.36 ప్రకారం జీతాలు పెంచాలని నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గౌడ్‌సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులు నిరంతరం ప్రజలకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పిస్తూ ఎలాంటి అంతరాయం లేకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం కార్మికులకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలుపర్చలేదని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సువర్ణమ్మ, సుశీలమ్మ, తిమ్మయ్య, జయన్న, రాజు, రమేష్, స్వాములు, విజయ్‌కుమార్ ఉన్నారు.

● మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఓబులేసు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శిశ శ్రీనివాసులు, సీపీఐ నాయకులు ప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు వారు వినతిపత్రాన్ని అందజేశారు.



గౌడ్‌సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

విద్యుత్ దీపాలు వెలిగించకుండా నిరసన



పట్టణంలోని కేజీ రోడ్డుపై వెలగని వీధిదీపాలు

ఆత్మకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం తమ నిరసనను తీవ్రతరం చేశారు. పట్టణంలోని కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై ఉన్న బట్టర్‌ప్లై వీధిదీపాలను వెలిగించకుండా నిరసన వ్యక్తం చేశారు. దీంతో పట్టణంలోని కేజీరోడ్డు చీకట్లను కమ్ముకోవడంతో ప్రజలు కొంత అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదిలావుంటే తొలిదశలో భాగంగా ప్రధాన రహదారిపై మాత్రమే వీధిలైట్లను వెలిగించలేదని, మున్సిపల్ అధికారులు స్పందించకపోతే అన్ని ఏరియాల్లో కూడా వీధిదీపాలు వెలగనివ్వమని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు భీష్మించినట్లు తెలిసింది. కాగా మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు వారితో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిరసనలను తెలియజేయాలని కోరినట్లు తెలిసింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 16వ తేదీ నుంచి మైండ్ స్పార్క్స్ స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. జిల్లాలోని ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు 15 రోజులు నిర్వహించే తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

మహానంది, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహానంది గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆటో యూనియన్ నాయకులు సోమవారం మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆటో యూనియన్ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

పాములపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మద్దూరు గ్రామంలో ఇంటింటి సుపరిపాలనలో ఏడాది కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, గోవిందులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లయాదవ్, ఖాత అంకిరెడ్డి, పూసలక్రిష్ణ, వెంకటేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి,చంద్రశేఖర్, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా తొలి అడుగు: ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం యేడాది పాలనలో అభివృద్ధి దిశగా తొలిఅడుగు వేసిందని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం కొండజూటూరులో ప్రభుత్వ పాలనపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం, ప్రభుత్వ పనితీరుపై గ్రామప్రజలను అడిగి తెలుసుకొని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్, భాస్కరరెడ్డి, సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గంగా నారాయణ, శాంతప్ప, నాయకులు కేశవ, ట్యాంకు పుల్లయ్య, ఈసాకు, యాకోబు, బాలస్వామి, చిన్నపుల్లయ్య, చౌరప్ప, రమణమూర్తి, రవి, అమరసింహారెడ్డి, శివశంకరరెడ్డి, రాంపుల్లారెడ్డి, మోహన్, దానం, ఎలీషా, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు: నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు.సోమవారం వెలుగోడు పట్టణంలోని ఇందిరా నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, ఖలీల్, అమీర్ హంజా, మండ్ల శంకర్‌రెడ్డి, శీలం వీరభద్రుడు, వెంకటరమణ, రాము, సంజీవరాయప్రసాద్, చంద్ర, సయ్యద్ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బుడ్డా

'రైతు సంక్షేమానికి కృషి చేయాలి'

పగిడ్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడి తెలిపారు. పగిడ్యాల వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సోమవారం సొసైటీ చెర్మన్‌గా దామోదర్‌రెడ్డి, డైరెక్టర్లు గా పల్లె గంగన్న, శంకర్‌ల ప్రమాణా స్వీకారోత్సవం చేశారు. సొసైటీకి వచ్చే ఎరువులను, పరికరాలు, రుణాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనతరం నూతన చెర్మన్ దామోదర్‌రెడ్డి, డైరెక్టర్లను వారు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు దేవెళ్ల మురళి, నందికొట్కూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రసాద్‌రెడ్డి, యాదవసంఘం రాష్ట్ర డైరెక్టరు వెంకటేశ్వర్లు యాదవ్, సురేంద్రనాథ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ పలుచాని పలుచాని మహేశ్వరరెడ్డి, లోకానందరెడ్డి, పలుచాని రాజశేఖర్‌రెడ్డి, వాసురెడ్డి, శ్రీనివాసులు, సొసైటి సీఈవో ఖాజా, వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం

నందికొట్కూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో నందికొట్కూరు డివిజన్ స్థాయిలో సబ్సిడీపై రైతుల గ్రూపులకు డ్రోన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జీ మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో సహాయపడేందుకు ఏపీ ప్రభుత్వం డ్రోన్లను సబ్సిడీపై అందిస్తోందన్నారు. 80 శాతం సబ్సిడీతో రైతుల గ్రూపులకు కూటమి ప్రభుత్వం డ్రోన్లు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఏడీఏ గిరిష్, మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి, గిరీశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్, ఏడీఏ గిరిష్, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైతు గ్రూపునకు డ్రోన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు గోరేసాహెబ్ అనారోగ్యానికి గురికావడంతో సోమవారం టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డి పరామర్శించారు. గోరేసాహెబ్ కుమారుడు కూడా ప్రమాదంలో గాయపడిన మన్సూర్‌బాషను పరామర్శించి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, లక్ష్మన్నగౌడు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● తక్కువ పెట్టుబడి, తక్కువ సమయంలో రైతులు పంటలపై మందుల పిచికారీ చేసుకోవచ్చని వ్యవసాయ అదికారి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తూడిచర్ల గ్రామానికి చెందిన శంకరమల్లేశ్వర స్వామి రైతుగ్రూపుకు మంజూరైన కిసాన్‌డ్రోన్ సోమవారం అందజేశారు. ప్రభుత్వం 80శాతం రాయితీతో అందించిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిలేటి, మల్లికార్జున, శంకరరావు, నీటిసంఘం అధ్యక్షులు శంకర్, శివతేజ, ఆహ్మద్, దస్తగిరి రైతులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల నుంచి నీరు విడుదల చేయాలి

పగిడ్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలో కురిసిన వర్షాలకు కృష్ణానదికి నీరు వచ్చి చేరడంతో నాగటూరు ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేసి రైతులు సాగు చేసిన పంటలను కాపాడాలని వైసీపీ మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి డిమాండ్ చేశారు. పగిడ్యాలలో ఆయన స్వగృహంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక మొక్కజొన్న పంటలు ఎండుతున్నాయన్నారు. పాలకులు, అధికారులు మాత్రం నాగటూరు ఎత్తిపోత్తల నుంచి నీటిని విడుదలకు ముందుకు రావడం లేదన్నారు. ఎత్తిపోతల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గుర్తైనా పట్టించుకోవడం లేదన్నారు. ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేసి పంటలను కాపడకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

నిధులు విడుదల చేయాలి

పాములపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు ఎక్కువగా నిదులు విడుదల చేసి ఆదుకోవాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న నాయీ బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు వెంకటరమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పాములపాడులో వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు అధికంగా మంజూరు చేయాలన్నారు. ప్రతి మండలంలోని స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు సాయిక్రిష్ణ, వాల్మీకి సంఘం నాయకుడు స్వాములు, మైనార్టీ సంఘం నాయకులు షర్ఫుద్దీన్‌అలీ, మాల మహానాడు నాయకులు మురహరి రాజన్న, రైతుసంఘం నాయకులు అంబన్న, తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

పాములపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై 37 బస్తాలను పంపిణీ చేశామని పశు వైద్యాధికారి భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాడి రైతులు పశుగ్రాసం పెంపకం కోసం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వార వార్షిక పశుగ్రాసం పెంపకం కోసం 10 నుంచి 50సెంట్ల సొంతభూమి కలిగి ఉండాలని, ఆధార్, ఉపాధిహామీ జాబ్‌కార్డ్, బ్యాంక్‌పాస్‌బుక్‌లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే గోకులం షెడ్స్, గొర్రెల పెంపకానికి షెడ్స్ నిర్మించేందుకు ఆసక్తిగల పాడి రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వాసుదేవగుప్త అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వెల్‌ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. అర్హులై ఉండి తల్లికి వందనం పడని వారి వివరాలను సేకరించాలని అన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి

మిడుతూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పీ4 సర్వేలో తేల్చిన 1163 బంగారు కుటుంబాల్లో ప్రతి పంచాయితి కార్యదర్శి మూడు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఎంపీడీవో దశరథరామయ్య అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం ఈవోఆర్‌డీ సంజన్న ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి లీకేజి సమస్యలను గుర్తించి వాటిని బాగు చేయించాలని అన్నారు.

సింగల్ విండో చైర్మన్‌గా జనార్దన్‌రెడ్డి

పాములపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం చైర్మన్‌గా జనార్దన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందారెడ్డి ల ఆధ్వర్యంలో త్రీమెన్ కమిటీ బసిరెడ్డి అరుణమ్మ, వీర క్రిష్ణుడు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి, పరమేశ్వరరెడ్డి, ఖాత అంకిరెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, నాగార్జునరెడ్డి, పూసలక్రిష్ణ లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, మోహన్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకుడు ఆది అన్నారు. సోమవారం నందికొట్కూరు జూనియర్ కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకుడు ఆది మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తగా పెండింగ్లో ఉన్న రూ.6400 కోట్లు ఫీజు రియంబర్స్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహబూబ్, డివిజన్ సహాయ కార్యదర్శి జగదీష్, శ్యాం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ప్రారంభవడం, వర్షాలు సకాలం కురుస్తుండటంతో రైతులు యూరియా కోసం ఎగబడుతున్నారు. గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 26 టన్నుల యూరియా రావడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి యూరియా కోసం రైతులు భారీగా వచ్చారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలిచి ఉన్నారు. రైతులు అధికంగా రావడంతో సొసైటీ సీఈవో ఆదినారాయణ ఒక పాసుపుస్తకానికి 5 యూరియా బస్తాలను పంపిణీ చేశారు.



యూరియా కోసం వేచి ఉన్న రైతులు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



గోరుమానుకొండలో కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గ్రామా ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్ర కాష్ రెడ్డి అన్నారు. సో మవారం మండలం లోని గోరుమానుకొండ, తండా, బేతంచెర్ల పట్ట ణంలోని 5, 6 వార్డు ల్లో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగ య్య, జాకీరుల్లా భేగ్, పోలూరు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గోరుమా నుకొండ, తండా గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. అలాగే బేతంచెర్ల పట్టణం లోని 5,6 వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కులమత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ కృష్ణయ్య, జంగం కృష్ణయ్య, అంజి, రవీంద్ర నాయక్, చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, తిరుమలేష్ చౌదరి, సుధాకర్, బుగ్గన బ్రహ్మానంద రెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, భీమేశ్వరరెడ్డి, సయ్యద్ షబ్బీర్ అహ్మద్, ఫయాజ్, టైలర్ రాముడు, విజయకుమార్, మాధవకృష్ణ, బీజేపీ నాయకులు నాగమో హన్, కౌశిక్, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

● **ఎమ్మెల్యే కోట్లకు వినతి పత్రం అందజేత**

మండలంలోని గోరుమానుకొండ సమీపంలో నూతనంగా నిర్మించిన ఎంఎస్ఎంఈ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వం మంగళగిరికి తరలించిందని, ఆ కళాశాలలను ఇక్కడికే తీసుకురావాలని ఏపీఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం గోరుమానుకొండలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షు లు నాగ సురేంద్రయాదవ్, స్వాములు, సురేష్, శివకృష్ణ, విష్ణు, గోపి పాల్గొన్నారు.

అమెరికా వెళ్లిన మున్సిపల్ చైర్మన్

డోన్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ వ్యక్తిగత పర్యటన కింద అమెరికా బయలుదేరి వెళ్లారు. దాదాపు నెల రోజుల పాటు అమెరికాలోని పలు పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తారు. తిరిగి ఆగస్టు 20న డోన్‌కు చేరుకుంటారు.

దెబ్బతిన్న కేసీ లైనింగ్

● ఐదేళ్ల నుంచి ప్రతిపాదనలకే పరిమితం
● చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

చాగలమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కేసీ పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టుకు నీరందించే పంట కాలువలు దెబ్బతిన్నాయి. కాలువల్లో ముళ్ల కంపలు, పూడిక పెరిగింది. లైనింగ్ దెబ్బతింది. కాలువల మరమ్మతు పనులు చేపట్టక పోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. గత ఐదేళ్ల నుంచి ఎలాంటి పనులు చేపట్టలేదు. కేవలం ప్రతి పాదనలతోనే సరిపెడుతున్నారు. నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. 1,000 ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సి ఉండగా 300 ఎకరాలకు కూడా నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలు సరిగా లేక పోవడంతో ఆయకట్టు రైతులు వరి పంట సాగును వదిలేసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటున్నారు. మల్లేవేముల గ్రామ సమీపంలో పంట కాలువ పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. చేసిన కాలువ పనులు నాణ్యత లోపించి లైనింగ్ దెబ్బతింది. దీంతో ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. చాగలమర్రి గ్రామంలోని మురుగు నీరంతా ఆయకట్టు పొలాల్లో ప్రవహిస్తుండటంతో వరి పంట సాగు చేసుకునేందుకు వీలు లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పంట కాలువ మరమ్మతు పనులు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. మురుగు నీరు పంట పొలాల్లో ప్రవహించకుండా చూడాలని రైతులు అధికారులకు తెలి యజేస్తున్నారు. కేసీ పంట కాలువలు, అక్విడెట్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిం చామని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. నిధులు మంజూరైతే పంట కాలువ పనులు పూర్తి చేస్తామని, అక్విడెట్ లీకేజీ కూడా మరమ్మతులు చేపడతామన్నారు.



చాగలమర్రి గ్రామంలో దెబ్బతిన్న కేసీ లైనింగ్



పిచ్చి మొక్కలతో నిండిన కేసీ కాలువ

రెండేళ్ల నుంచి వరి సాగు చేయలేదు



కేసీ పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు సరిగా లేక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. కేసీ ఆయకట్టు కింద రెండేళ్ల నుంచి వరి సాగు చేయడం లేదు. మురుగు కాలువ నీరంతా పొలంలో ప్రవహిస్తుండటంతో వరి నాట్లు వేసుకోలేక ఇబ్బంది పడుతున్నాం. మురుగు ప్రవహించకుండా చూడాలి. ఈ ఏడాదైన సాగునీరు అందేలా చూడాలి.

- శివుడు, రైతు, చాగలమర్రి

పట్టించుకోవడం లేదు



కేసీ కాలువ కింద పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. చివరిఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పంట కాలువలు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరందక ఇబ్బంది పడుతున్నాం. వరి పంట తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకోవాల్సి వస్తోంది. ఈ ఏడాదైన కాలువ పనులు చేపట్టి సాగునీరందేలా చూడాలి.

- రామసుబ్బయ్య, రైతు, చాగలమర్రి

అమ్మ పేరుతో మొక్క నాటాలి

చాగలమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మొక్కల సంరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థిని అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత బాలికలకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 49 పాఠశాలల్లో 550 మొక్కలు పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థినులు మొక్కలకు తల్లుల పేర్లు పెట్టి వాటిని సంరక్షణ చేయాలని అన్నారు. మూడేళ్ల పాటు మొక్కలు పెంచినందుకు గ్రీన్‌పాస్ కార్డు అందజేస్తారని, ఈ అవకాశాన్ని విద్యార్థినులు వినియోగించుకోవాలని అన్నారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షణ చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శివలక్ష్మి, సీఆర్పీ అమీర్‌ఖాన్, పీఈటీ భారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.



బాలికల పాఠశాలలో మొక్క నాటుతున్న ఎంఈవోలు ,హెచ్ఎం

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు - మండల సమావేశంలో ఎంపీపీ గోకుల్ లక్ష్మి

ప్యాపిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ గోకుల్ లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీటి సమస్యల తలెత్తకుండా చూడాలన్నారు. గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. అంతకుముందు అనారోగ్యంతో మృతి చెందిన జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డికి సభ్యులు సభలో సంతాపం తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు భారతి, ఏఈలు ప్రభాకర్‌రెడ్డి, వినయ్‌కుమార్, మనోహన్, ఏవో రాజేష్, ఉద్యానవనశాఖ అధికారి కళ్యాణి, ఎంపీటీసీలు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

చాగలమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్ట వద్దగల కేసీ కాలువకు నీరు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనవిధంగా ఈ ఏడాది జూలైలోనే కేసీకి నీరు వదలడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కేసీకెనాల్ ప్రాజెక్టు చైర్మన్ రాఘవరెడ్డి, డీసీ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎస్ఈ బాల చంద్రారెడ్డి, డీఈ పుల్లయ్య, ఏఈలు జమాల్‌వలి, ఆశాజ్యోతి, సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హర్షం

బనగానపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కడంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమ వారం హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొన సాగుతూ విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయ నేతగా పేరు గాంచిన వ్యక్తికి సముచిత స్థానం లభించడం అభినందనీయమన్నారు. సుదీర్ఘ రాజకీయ, పరిపాలనా అనుభవం కలిగిన నేత అశోక్ గజపతి రాజు అని మంత్రి బీసీ కొనియాడారు.

ఉపాధి పనుల పరిశీలన

సంజామల, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆల్వకొండ, పేరుసోమల, రెడ్డిపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ సాంబశివరావు సోమవారం పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో జయంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

కోవెలకుంట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఫోర్‌వీలర్స్ ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం. సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో గ్రామ పంచాయతీ పార్కులో సీఐటీయూ యూనియన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రఘు, రాజు, మద్దిలేటి భూషణం, నడిపెన్న, సుబ్బారెడ్డి, శ్రీను, మధు కార్మికులు పాల్గొన్నారు.

హైవే కేసీ రక్షణ గోడకు మరమ్మతులు

చాగలమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని హైవే రహదారిలో కేసీ కాలువపై వంతెన గోడకు టోల్‌ప్లాజా సిబ్బంది మరమ్మతు పనులు చేశారు. ప్రమాదకరంగా కేసీ వంతెన గోడ అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన టోల్ అధికారులు సోమవారం గోడకు మరమ్మతు చేయించారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి గ్రామసభలు

కోవెలకుంట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 12 సచివాలయాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వర ప్రసాద్ తెలిపారు. ఈనెల 25వరకు పీ-4 గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ గ్రామసభలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు.

శాకంబరిగా పార్వతీదేవి

చాగలమర్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో సోమవారం శాకంబరిగా పార్వతీదేవి కొలువుదీరారు. ఆషాఢమాసం సంకట చతుర్థి సందర్భంగా మహిళలు సామూహికంగా పార్వతిదేవిని పండ్లు, కూరగాయలు, పూలతో అలంకరించారు. సారె సమర్పించి వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

బేతంచెర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయం ముందు మోకాళ్ల మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ ఆచారి, ఎల్లయ్య మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. రాబోయే కాలంలో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజలకు తాగునీరు వీధిలైట్లు వెలగకపోవడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు కాశీ, జలీల్, నాగన్న, అకిల్, విజయ్, శ్రీను, రాజు, చందు, మద్దయ్య పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

సొసైటీ చైర్మన్ ఎల్లగౌడు ప్రమాణ స్వీకారం



చైర్మన్ ఎల్లగౌడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

డోన్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): డోన్ సహకార సంఘం చైర్మన్‌గా ఎల్లగౌడు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం పట్టణంలోని కోట్లవారిపల్లెలో కోఆపరేటివ్ బ్యాంకు కార్యాలయంలో సీఈవో సుబ్బయ్య చైర్మన్ ఎల్లగౌడుతో పాటు డైరెక్టర్లు మల్లికార్జున, గొల్ల సుంకన్నలతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ ఎల్లగౌడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో డోన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ఎంపిక చేసిన డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికె ఫణిరాజు, టీఈ రామకృష్ణగౌడు, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఆలేబాదు పరమేష్, భాస్కర్ నాయుడు, కొత్తకోట శ్రీను, రంజిత్ కిరణ్, ఓంప్రకాష్, చిన్న పూజర్ల నాగరాజుగౌడు, కనపకుంట గోవిందరెడ్డి, న్యాయవాదులు బద్దల వెంకటేశ్, లక్ష్మన్న డా.వలి, బంధు మిత్రులు చైర్మన్‌ను సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్యాపిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దారు భారతి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భీమేష్, రామాంజినేయులు, చిన్నపుల్లయ్య పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు

ప్యాపిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆయా ప్రాంతాల్లోని చావిడీలలో పీర్లను కొలువుదీర్చారు. సోమవారం గ్రామాల నుంచి ఆడపడుచులు, బంధువులు తరలిరావడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. పీర్లను దర్శించుకొని పూజలు చేశారు. తొమ్మిదిరోజుల పాటు మొహర్రం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నింబంధనలు పాటించాలని పోలీసులు తెలిపారు.

ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా

కొలిమిగుండ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బి.ఉప్పలూరు మజారా గ్రామమైన బి.తాడిపత్రి గ్రామంలో తాగు నీటి సమస్యకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో పరిష్కారం లభించింది. 500మంది జనాభా కలిగిన గ్రామంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంచాయతీకి సంబంధించిన బోరులో భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. విషయం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి పోవడంతో వెంటనే స్పందించి ట్యాంకరు ఏర్పాటు చేయించి నీరు సరఫరా చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జడ్పీ చైర్మన్‌పై దాడి హేయం

కొలిమిగుండ్ల, జులై 14 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా జడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై దాడి హేయమైన చర్య అని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండయ్యగౌడు అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి, మహిళ అని చూడకుండా టీడీపీ శ్రేణులు దాడి చేయడం శోచనీయమన్నారు. దీన్ని గౌడ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజా స్వామ్యంలో ఇది ఎంత మాత్రం మంచిది కాదన్నారు.

దరఖాస్తుల వెల్లువ

ఉయ్యాలవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల ప్రజావేదికలో సమస్యలు వెల్లువెత్తాయి. సర్వారాయపల్లె గ్రామస్థులు గ్రామంలోని శ్మశాన వాటికను కొందరు వ్యక్తులు ఆక్రమించినట్లు తహసీల్దారు సువర్ణదేవి దృష్టికి తెచ్చారు. అదేవిధంగా ఉయ్యాలవాడ, మాయలూరు గ్రామానికి చెందిన పలువురు సమస్యలను అర్జీ రూపంలో అందజేశారు. ఆయాశాఖల అధికారులు హాజరయ్యారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

రుద్రవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దారు మల్లిఖార్జునరావు అన్నారు. సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలన్నారు. ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

'అన్నదాత సుఖీభవ' జాబితా సిద్ధం

రుద్రవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 16 రైతు సేవా కేంద్రాల పరిధిలో అన్నదాత సుఖీభవ జాబితా సిద్ధం చేసినట్లు ఏవో సుమిత సోమవారం తెలిపారు. చుక్కల భూములు ఇనాంభూములు, దేవాలయ భూములు, సర్వీసు ఇనాంభూములకు సంబంధించి రైతుల జాబితా 1985 మందిగా నిర్ధారించామన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా జాబితాను ఫైనల్ చేసినట్లు తెలిపారు. జాబితాను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు వారు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడపరాదు

రుద్రవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడపకూడదని ఎస్ఐ మహ్మద్‌రఫీ తెలిపారు.సోమవారం వాహనాలు తనిఖీ చేశారు.వాహనదారులు లైసెన్స్, పత్రాలు కలిగి ఉండాలన్నారు.

బదిలీపై వెళ్లిన సర్వేయర్లకు సన్మానం

దొర్నిపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బదిలీపై వెళ్లిన సర్వేయర్లకు తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డీటీ మాదవ్, వీఆర్వోలు, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

సంజామల, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్మశానానికి స్థలం కేటాయించాలని పేరుసోమలకు చెందిన ఎస్సీలు కోరారు. సోమవారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కంబగిరి రాముడు, బాలయ్య, లక్ష్మీనాథ్, లోకేష్ , కంబయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

● రూ.5.37లక్షల ఎరువులు సీజ్



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బనగానపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు బనగానపల్లె పట్టణంలో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, ఏవోలు ప్రసాదరావు, సుబ్బారెడ్డి తదితరులు పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలలో పెద్ద ఎత్తున తనిఖీలు చేశారు. సీతారామ ఫర్టిలైజర్స్, సత్యం కెమికల్స్ దుకాణాల్లో సరైన పత్రాలు చూపలేకపోవడంతో రూ.5.37 లక్షల ఎరువులను సీజ్ చేశారు. యూరియా కృతిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు చేపడతామని హెచ్చరించారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

కొలిమిగుండ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణంలో మంగళవారం నిర్వహిస్తున్న సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు సోమవారం కోరారు. కార్మికులు, కర్షకులు తరలిరావాలన్నారు. సమావేశంలో సంజీవులు, సూర్యనారాయణ పుల్లయ్య, వడ్డె మహేష్, కంబగిరిస్వామి ఉన్నారు.